ప్రజాశక్తి

ఆదివారం 11 మే 2025

5

పార్వతీపురం మన్యం

ఎడారిని తలపిస్తున్న నాగావళి

ప్రజాశక్తి - వీరఘట్టం

నిన్నటి వరకూ నీరుతో కళకళలాడిన నాగావళి నది నేడు ఎడారిని తలపిస్తోంది. రోజురోజుకు ఎండలు అధికంగా ఉండడంవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రస్తుతం నాగావళి నదిలో నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతుంది. నది పరివాహక ప్రాంతాల ప్రజలు ఈ వేసవిలో ఎలా గడపాలంటూ ఆందోళన చెందుతున్నారు.

ఇసుక దిబ్బలతో కనిపిస్తున్న నాగావళి నది

ఒక్కొక్కరుగా...

కూటమిలో చేరుతున్న వైసిపి ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పాలకొండ

ఏ పార్టీ అధికారులోకి వస్తే ఆ పార్టీలోకి నాయకుల కప్పగంతులు తప్పడంలేదు. స్వలాభం కోసం నాయకులు ఇలా పార్టీలు మార్చడం సాధారణమై పోయింది. ఒకప్పుడు పార్టీనే నమ్ముకొని, ఆ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉండేవారు. అయితే కొంత కాలంగా నాయకుల్లో నైతిక విలువలు ఉండడంలేదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లిపోవడమే తప్ప ప్రజా ప్రయోజనాలను పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. పాలకొండ మండల పరిషత్‌తో పాటు నగర పంచాయతీలో వైసిపికే సంఖ్యాబలం ఉంది. వైసిపి అధికారం కోల్పోవడంతో ఇటీవల కాలంలో ఆ పార్టీ నుంచి వలసలు పెరుగుతున్నాయి. జనసేన ఎమ్మెల్యే ఇక్కడ ప్రాతినిధ్యం వహించడంతో ఆ పార్టీలోకి వలసలు కడుతున్నారు మండల పరిషత్‌లో 12 మంది సభ్యులుండగా, 10మంది వైసిపి ఎంపిటిసి సభ్యులు, ఇద్దరు టిడిపి సభ్యులు ఉండేవారు. అయితే ఇటీవల కాలంలో వైసిపికి చెందిన ఎంపిపి బొమ్మలు భానుతో పాటు వైస్ ఎంపిపి అనిల్, మరో ఇద్దరు ఎంపిటిసి సభ్యులు జనసేనలో చేరారు. మరో ఒకరిద్దరూ వచ్చే అవకాశాలు ఉన్నట్టు రాజకీయంగా చర్చ జరుగుతుంది. అదేవిధంగా నగర పంచాయతీలో 20 వార్డులకు గాను 17మంది వైసిపి కౌన్సిలర్లు ఉండగా, ముగ్గురు టిడిపి సభ్యులు ఉన్నారు. ఎన్నికల ముందే వైసిపి నుంచి నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొరికాన గంగు నాయుడు జనసేనలో చేరారు. ఇటీవల కాలంలో వైసిపికి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ రాధా కుమారి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో సంఖ్య15కు తగ్గింది. కొద్దిరోజుల క్రితమే రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి టిడిపిలో చేరారు. తాజాగా పదో వార్డ్ కౌన్సిలర్ కొంచాడ అరుణ్ కుమార్ సతీమణి జనసేనలో చేరడంతో కూటమికి మరింత బలం పెరిగిందని చెప్పవచ్చు. వైసిపి నుంచి వలసలు పెరుగుతున్నప్పటికీ ఆ పార్టీ నేతలు ఎందుకు నిలవరించలేకపోతున్నారన్న చర్చ జరుగుతుంది. నగర పంచాయతీలో మరి కొంతమంది నేతలు పార్టీ మారేందుకు ఊగిసలాటలో ఉన్నట్లు తెలుస్తుంది. రానున్న రోజుల్లో పాలకొండ మండల పరిషత్‌లోనూ, నగరపంచాయతీలో కూటమి పట్టు సాధిస్తుందని రాజకీయ వర్గాల చర్చ జరుగుతుంది.

ఎమ్మెల్యే జయకృష్ణ సమక్షంలో జనసేనలో చేరిన వైసిపి కౌన్సిలర్, నాయకులు

జనసేనలోకి కౌన్సిలర్‌తో పాటు మరికొంత మంది చేరిక

పదో వార్డ్ కౌన్సిలర్ కొంచాడ అరుణ్‌కుమార్ భార్య సరోజనమ్మతో పాటు మరో 50మంది కార్యకర్తలు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమక్షంలో శనివారం జనసేనలోకి చేరారు. జనసేన సిద్ధాంతాలతో పాటు ఎమ్మెల్యే జయకృష్ణ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరామన్నారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొంచాడ అరుణ్ కుమార్, ఎంపిపి బొమ్మాలి భాను, వైస్ ఎంపిపి వాకుమూడి అనిల్, ఎంపిటిసి సభ్యులు మజ్జి నవీన్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొరికాన గంగనాయుడు, టిడిపి మండల నాయకులు జాడ శ్రీధర్, జనసేన నాయకులు జానీ, ప్రశాంత్ కుమార్, రమేష్ తదితరులు ఉన్నారు

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సామాజిక మాధ్యమాల్లో దేశం/మతాల పట్ల విద్వేషాలు సృష్టించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం చేసే పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ సరిహద్దుల వద్ద యుద్ధవాతావరణం దృష్ట్యా జిల్లాలో ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించరాదని, అటువంటి వాటికి అనుమతులు ఇవ్వబడవని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకటనలో తెలిపారు. త్రివిధ దళాలుకు, కేంద్రబలగాలకు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించేలా బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ప్రజలకు, యువతకు ఎస్పీ సూచించారు. అలాగే ప్రస్తుత యుద్ధ తరుణంలో ప్రతి పౌరుడు ఒక సైనికుడిలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం దృష్ట్యా జిల్లాలో ప్రజలు, నాయకులు ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించరాదని, ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలకు ఎటువంటి అనుమతులు ఇవ్వబడవని ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దుష్ప్రచారం చేసే పోస్టులు సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసిన, పోస్ట్ చేసిన ఆడియో, వీడియో మెసేజ్‌ల రూపంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అధికారిక సందేశాలు తప్ప, అనధికార సందేశాలు వ్యాప్తి చేయరాదన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్), ఇతర సోషల్ మీడియాలో దేశం/మతాల పట్ల విద్వేషాలు సృష్టించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఏదైనా సందేశం ఫార్వర్డ్ చేసేముందు అది వాస్తవమైనదా కాదా నిర్ధారణ చేసుకున్నాక గ్రూపుల్లో షేర్ చేయాలని తెలిపారు. అలాగే సందేశం ఫార్వర్డ్ చేస్తే గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం

కుదిరిన వేతన ఒప్పందం

- ఆర్‌టిసి కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె విరమణ
- ఐక్యంగా పోరాడి విజయం సాధించిన కార్మికులను అభినందించిన సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందం కోసం గత మూడు రోజులుగా సమ్మె చేయటంతో శుక్ర, శనివారాల్లో పార్వతీపురం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, యూనియన్ ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం నిర్వహించి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనాలు పెంచేందుకు, ఇఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించారు. చట్ట ప్రకారం జాతీయ పండగ సెలవులు ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి అమలు చేస్తామని తెలిపారు. దీంతో కార్మికులు మూడు రోజులుగా చేస్తున్న సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌టిసికాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, కార్మికులను అభినందించారు. ఈ వేతన ఒప్పందం జరిగేందుకు కృషి చేసిన జిల్లా ప్రజారవాణా అధికారి శ్రీనివాసరావు, పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ, ఇతర అధికారులకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరరావు, కృష్ణకాంత్, వెంకటేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

సిహెచ్‌ఒలపై బెదిరింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమస్యల పరిష్కారం కోరుతూ 12 రోజులుగా సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించకుండా, షోకాజ్ నోటీసులిచ్చి వారిని బెదిరించి రాష్ట్ర ప్రభుత్వం లొంగదీసుకోవడం సరికాదని, దీన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసిన సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాలని, 23శాతం జీతం పెంచాలని, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు సొంత భవనాలు సమకూర్చి, ఉద్యోగ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె జరుగుతున్న విషయం ప్రభుత్వానికి తెలిసినా చర్చించి, పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులిచ్చి బెదిరింపులకు దిగడం మానుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లను ఇదే తరహాలో మంత్రులు బెదిరించాలని, ఇప్పుడు సిహెచ్‌ఒలను అదే విధంగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరికాదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నేటికీ పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాల్లేవని, ఇలాంటి తరుణంలో ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఉన్నంతలో ప్రజలకు వైద్య సేవలందిస్తూ స్థానికంగా నివాస సౌకర్యాలు లేకపోయినా ఇబ్బందులు ఎదుర్కొనే ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం ఇలాంటి ఉద్యోగులపై సానుభూతి చేపకపోగా సమస్యలు చెప్పుకుంటే కక్ష సాధింపులకు దిగుతోందని, పోరాడే వారిని అణగదొక్కాలని చూసిన ప్రభుత్వాలన్నీ మనుగడ సాధించలేకపోయిన విషయాన్ని నేటి కూటమి ప్రభుత్వం కూడా గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు అన్ని సెక్షన్ల కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి నేడు పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా బెదిరించి లొంగదీసుకోవాలని చూస్తే గత ప్రభుత్వం విధానాన్ని కూటమి ప్రభుత్వం అనుసరించినట్లు అవుతుందని, ఇలాంటి చర్యలు మానుకోకుంటే పోరాడుతున్న వారికి అండగా అందరూ కార్మికుల్ని ఉద్యోగాలను నిలిపి ఉధృతం చేసే దానికి సిద్ధపడతామని హెచ్చరించారు. సమ్మె చేస్తున్న సిహెచ్‌ఒలతో చర్చలు జరిపి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.గౌరు రాజు, సింహాద్రి పాల్గొన్నారు.

13న ఐటిఐ విద్యార్థులకు అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 13న స్థానిక ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు సాలూరులో అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించినట్లు స్థానిక ఐటీఐ ట్రైనింగ్ అధికారి కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఐటిఐ ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు అప్రెంటిటీస్ షిప్ ఇప్పించబడుతుందని అన్నారు. హాజరైన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో ఐటిఐ కళాశాలకు ఈనెల 13న ఉదయం10గంటలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో సుమారుగా 100 ఖాళీలు ఉండగా వీటిలో బొబ్బిలి, విజయనగరం, విశాఖ నగరాల్లో అప్రెంటీష్ కోసం వేసువిస్ ఇండియా లిమిటెడ్, పాటిల్ రైల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్, కార్బన్ రిసార్సస్ ప్రయివేట్ లిమిటెడ్, తదితర కంపెనీల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే అప్రెంటీష్ అయిన వారు కూడా ప్లేస్‌మెంట్ కోసం రావచ్చునని, స్టైపెండ్ రూ.12వేలు నుండి 15వేల వరకు ఇవ్వబడుతుందన్నారు. హాజరు కావాల్సిన వారు బయోడేటాతో పాటు, ఎస్ఎస్‌సి మార్క్‌ల జాబితా, ఐటిఐ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్ అడ్రస్. తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కరుపాం

కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు ఆర్థిక అభివృద్ధి భరోసాను ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద మహిళలకు నిర్వహించిన టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వారి కోసం అనేక రకాల శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. శిక్షణ ఇవ్వడమే కాకుండా పూర్తి చేసుకున్న అనంతరం మిషన్ కూడా మహిళలకు అందజేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నారని అన్నారు. కావున ప్రతి మహిళా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి వై.వెంకటనాయుడు, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు వెంపటాపు భారతి, చందక రామకృష్ణ, కర్రి శ్రీను, సాయి, బలగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ముగ్గురు వ్యక్తులకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు, స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదుగా ముగ్గురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాలూరు పట్టణానికి చెందిన రాపాక సూర్యకుమారికి రూ.35,569, తాళ్లాడ సుభద్రమ్మకు రూ.65,931, మండలంలోని నిహాల్‌కు చెందిన రూ.1,03,404 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. కష్టకాలంలో ఆదుకున్న మంత్రి సంధ్యారాణికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆమదాల పరమేశు, కౌన్సిలర్ హర్షవర్ధన్, మండల నాయకులు గూడేపు యుంగధర్, నాయకులు పాల్గొన్నారు.

నడిమికెళ్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్లలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, చిన్నారులు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీల్లో ఆగ్రహం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఓ వైపు డిఎస్‌సి సమయం దగ్గరపడుతోంది. మరోవైపు గిరిజనులకు మెగా డిఎస్‌సిపై ప్రభుత్వం నోరు మెదపడం లేదు. దీంతో, గిరిజన ఆదివాసీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ప్రభుత్వం మాత్రం తనకు పట్టనట్టు వ్యవహరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు చేస్తున్న ఆందోళనలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇటీవల పలు దఫాలు స్పందించిన విషయం విధితమే. తొలుత అమాయక గిరిజనులు వైసిపి మాటలు నమ్మి మోసపోవద్దంటూ ప్రకటన చేశారు. వాస్తవానికి గిరిజనులు వైసిపిని కూడా నమ్మలేదు. ఎందుకంటే వైసిపి కూడా ఇటువంటి హామీ ఇచ్చి మోసం చేసింది. బహుశా అందుకేనేమో వైసిపి ఆవిర్భావం నుంచి మంచి పట్టున పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో ఆ పార్టీని మట్టికరిపించింది. అందులో భాగంగానే సాలూరు వాసులు సంధ్యారాణికి పట్టం కట్టారు. ఆమెకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి కూడా వరించింది. అందువల్లే వైసిపిని నమ్మొద్దని గిరిజనులకు చెప్పడం వారిని దూరం చేసుకోవడం లేదా తప్పుదారి పట్టించడమేనని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. ఆ తరువాత కొద్ది రోజులకే ఆందోళనలు ఆపితే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి గిరిజన మెగా డిఎస్సీ విషయమై త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చే విధంగా కృషిచేస్తానని చెప్పారు. తీరా నిన్నకాక మొన్న జరిగిన సమావేశంలో అటువంటి చర్చయేమీ వినిపించలేదు. మంత్రి అందుకు తగ్గట్టు ప్రయత్నం చేశారా? లేక ఆమె ప్రయత్నాన్ని సిఎం చంద్రబాబు తోసిపుచ్చారా? అన్నది మంత్రికే ఎరుక. గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శితో గిరిజనసంఘం నాయకులు సమావేశమైనా

స్పెషల్ డిఎస్‌సి నిర్వహణపై ఎటువంటి సానుకూలతా రాలేదు.

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. నోటిఫికేషన్‌లోని 16,347 పోస్టుల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. కానీ, 2వేల పోస్టుల వరకు గిరిజనులకు ఉన్నాయని మంత్రిగారు చెబుతున్నారు. ఇది మోసపూరిత ప్రకటన అని ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మంత్రి చెప్పింది వాస్తవమైతే ఆ రెండువేల పోస్టులు ఎక్కడెక్కడ గిరిజనులకు రిజర్వుచేయబడ్డాయో స్పష్టంగా చెప్పాలంటూ గిరిజనుల చేస్తున్న డిమాండ్‌కు మంత్రి నుంచి స్పందన రావడం లేదు. ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పిన గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆ మాటను నిలబెట్టుకోకపోవడంతో ఆదివాసీ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉద్యోగాల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై రగిలి పోతున్నారు. ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పించే జిఒ 3 రద్దుపై పాలకపార్టీల తీరుపైనా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీ యువత ఈ రెండు జిల్లాల్లో భారీగా ఉంది. బిఇడి, డైట్, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం వయసు సడలింపు ఇవ్వడంతో తాజా డిఎస్‌సికి మరింత పోటీ పెరిగింది. మన్యం, అల్లూరి జిల్లాల్లో 889 పోస్టులు ఉంటే గిరిజనులకు తాజా నోటిఫికేషన్‌లో కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. దీంతో, తమ ప్రాంతంలో తమకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా పోతుండడంతో గిరిజన యువతలో అసహనం పెరుగుతోంది.

ప్రత్యేక డిఎస్ సితోనే న్యాయం

ఏజెన్సీలో గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో ఆ పోస్టులను భర్తీ చేస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. సాధారణంగా నిర్వహించే డిఎస్‌సి ద్వారా గిరిజన అభ్యర్థులకు ప్రయోజనం బహు స్వల్పం. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డిఎస్‌సి ద్వారా 640 పోస్టులను భర్తీ చేస్తామని జిఒ 233 జారీ చేసింది. కానీ, అది అమలుకాలేదు. గిరిజన సంఘాలు, గిరిజన నిరుద్యోగులు ఆందోళనలు చేసి నా ఫలితం లేకపోయింది. 2015లో అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రావెల కిశోరబాబు గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తా మని ప్రకటించారు. మూడేళ్లపాటు నోటిఫికేషన్ వెలువడలేదు. 2019 ఫిబ్రవరిలో 611 పోస్టుల భర్తీకి టిడిపి ప్రభుత్వం జిఒ 10ని జారీ చేసింది. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెలువడలేదు. ఆదివాసీ ప్రాంతంపై ప్రభుత్వాల ఉదాసీనతకు తోడు అధికారుల అలసత్వంతో ఆదివాసీ ప్రాంతంలో విద్య, సంక్షేమం, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతులు లొసుగులమయంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపనకు, మంత్రి సంధ్యారాణి గిరిజన జాతికి ఇచ్చే హామీ నిలబెట్టుకునేందుకు గిరిజన యువత చేస్తున్న పోరాటం బలపరీక్షగా మారిందని పబ్లిక్ టాక్.

ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కలిగించాలి

అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వాసుపత్రిపై నమ్మకం కలిగించేలా మరింత బాధ్యతగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో పనిచేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాజకీయ నాయకులుగా తాము కూడా ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యానికి వస్తామని, ఆసుపత్రి కూడా నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఆక్సిజన్ నిల్వలు ఉంచేలా దృష్టి పెట్టాలన్నారు. మహాప్రస్థానం వాహనం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని, దీనిపై తాను సంబంధిత మంత్రితో మాట్లాడుతానని అన్నారు. ఆసుపత్రిలో రోగులకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రిఫరల్ కేసులు తగ్గేలా చూడాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతానికి దగ్గరగా ఉన్న హాస్పటల్ కావడంతో పాముకాట్లు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఫిజీషియన్ ఇక్కడి నుంచి డిప్యూటేషపై వైద్యాధికారి వెళ్లే విషయాన్ని కూడా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. డయాలసిస్ కేంద్రంలో 30 బెడ్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగభూషణ మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రూ.2.50కోట్లు ఆసుపత్రి అభివృద్ధి నిధులు మంజూరయ్యాయన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు అడపా బాబ్జీ, అనుపుజవ రాజు, ఎస్.సరస్వతి, పి రాజశేఖర్, ఎచ్చెర్ల జయరాం, నగర పంచాయతీ చైర్మన్ ఆకుల మల్లేశ్వరి, వైస్ ఎంపిపి వాకుమూడి అనిల్, తూర్పు కాపు రాష్ట్ర డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ వెన్న శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి సుధా, ఆకుల కుమార్, సుందరరావు తదితరులు ఉన్నారు.

మలేరియా స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి మోహనరావు

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల వంభరవెల్లి, పెద్ద గూడ, బూర్జిగూడ గ్రామాల్లో శనివారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు ఆధ్వర్యంలో ఐఆర్ఎస్, ఎసి 5% ద్రావణం మిక్సింగ్ చేసి స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోపల, బయటకు ఇరువైపులా స్ప్రేయింగ్ చేయించుకోవాలని అవగాహన కల్పించారు. తద్వారా మీకు మలేరియా దోమ రాకుండా ఉంటుందని చెప్పారు. మలేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గిరిజనులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి స్ప్రేయింగ్ దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజల కోసమే ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రత్యేక ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతులు రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. వెంటనే పరిష్కారమయ్యేవి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. మిగతా కొన్ని వినుతులను సంబంధిత శాఖ వారికి బదిలీ చేసి పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నాయకులు విప్లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2560 లీటర్ల బెల్లం ఊటలు నేలమట్టం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జగన్నాయుడు గూడ సమీపంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించార. 2560 లీటర్ల బెల్లం ఊటలను నేలమట్టం చేసి, సారా తయారు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ సూర్యకుమారి, ఎస్‌టిఎఫ్ ఎస్ఐలు మురళీధర్, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మైదాన ప్రాంత రైతులు వరితో పాటు వాణిజ్య పంటలైన మొక్కజొన్న, మినుములు, చోడి, నువ్వులు పంటలపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. జియమ్మవలస మండలం పెదబుడ్డిడి, చినబుడ్డిడి, అంకవరం, బిజెపురం, తుంబలి, శిఖబడి తదితర గ్రామాల్లో రైతులు వేసవిలో వరి పంటతో పాటు వాణిజ్య పంటలను పండిస్తున్నారు. తోటపల్లి ఎడమ కాలువ నీరు అందుబాటులో ఉండడంతో మైదాన ప్రాంత రైతులు ఏడాదిలో ఐదారు పంటలను పండిస్తూ ఆర్థిక పరిపుష్టి చెందుతున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగులో పండిస్తున్న పంటలకు మార్కెట్లో కూడా మంచి డిమాండ్ ఉండడంతో వాణిజ్య పంటలు పండించడంపై మక్కువ చూపుతున్నారు.

ఘనంగా టిటిడి ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని టిటిడి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు అందుకున్నారు. అనంతరం హోమం కాల్చారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది, ఆంజనేయులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న వీరఘట్టం- పాలకొండ రోడ్డు

ఎట్టకేలకు రహదారి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం- పాలకొండ ప్రధాన రహదారిలో ఎట్టకేలకు రహదారి మరమ్మతు పనులు చేపడుతున్నారు. రేగులపాడు, వండువ గ్రామ జంక్షన్ వద్ద గల రహదారి పూర్తిగా గతుకులమయం కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంతకాలం తర్వాత గతుకులు కప్పేందుకు బిటి రహదారి పనులు చేపట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

సంప్రదాయ విత్తనాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దేవనాపురం పంచాయతీలో గల జగతపల్లిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సంప్రదాయ విత్తనాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు సంప్రదాయ విత్తనాల ప్రాధాన్యత కోసం వివరించారు. హైబ్రీడ్ విత్తనాలు ఉపయోగించడం వల్ల నష్టాలను తెలిపారు. ప్రతి రైతు సంప్రదాయ విత్తనాలైన రాగి, సామ, కొర్ర, మొక్కజొన్న మొదలగు విత్తనాలు ఉపయోగించడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా బాగుంటుందని అవగాహన కల్పించారు. అడవిలో దుంపలు, ఆకుకూరలు సేకరించి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, అలాగే ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఇటువంటి సంప్రదాయం పూర్వకాలం బాగుండేదని, కావున ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చుట్టుపక్క గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులనుద్దేశించి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బిల్లులందక ఆగిన పనులు

బిల్లుల కోసం గుత్తేదారులు ఎదురు చూపు
అర్ధాంతరంగా నిలిపివేసిన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గ్రామాల్లో వివిధ రకాలైన అభివద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. పనులు శరవేగంగా జరిగినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో పనులు ఫుల్... బిల్లులు నిల్ అన్న చందంగా తయారైంది. దీంతో గుత్తేదారులు ఎక్కడికక్కడే అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు.

మండలంలోని విక్రంపురం జంక్షన్ నుండి కంబర వలస గ్రామం మీదుగా కంబర వరకు రూ.కోటీ పది లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. వీరఘట్టం, వట్టిగెడ్డ వంతెన నుంచి కొట్టుగుమ్మడ మీదుగా గడగమ్మ వరకు కోటి రూపాయలు, చిదిమి జంక్షన్ సీఎస్పీ రహదారి నుంచి చిదిమి వరకు రూ.కోటీ 20 లక్షలు, పివిఆర్ పురం నుంచి తూడి వరకు రూ.రెండు కోట్లతో, ఆడారు బిటి రహదారి నుంచి డిపి వలస వరకు రూ.50 లక్షలు, బిటివాడ గ్రామ బిటి రహదారి నుండి చే బియ్యంవలస వరకు రూ.40లక్షలు, ఎం.రాజపురం గ్రామ జంక్షన్ సీఎస్పీ రహదారి నుంచి ఎం.రాజపురం మీదుగా కత్తులకవిటి వరకు రూ. రెండు కోట్లతో ఐటిడిఎ పర్యవేక్షణలో ఉపాధి హామీ చట్టం ద్వారా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఈఏడాది మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి పనులు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు అధికారులు జారీ చేసినప్పటికీ గుత్తేదారులు లక్షలాది రూపాయలు అప్పు చేసి పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అలాగే ఎం.రాజపురంలో రూ.50 లక్షలతో సిసి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. కొట్టు గుమ్మడలో రూ.25.5లక్షలతోనూ, బూరుగలో రూ.20 లక్షలతో, కంబరలో రూ.25 లక్షలతో, గడగమ్మలో రూ.10లక్షలతో, బిటివాడలో రూ.11 లక్షలతో, బొడ్లపాడులో రూ.12లక్షలతో ఉపాధి హామీ చట్టం ద్వారా సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ బిల్లులందక పోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుత్తేదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయం ముంచికొస్తుందని రహదారుల నిర్మాణ పనులు వేగంగా చేయడంతో ప్రారంభించక ముందే కొన్ని బిటి రోడ్డు మరమ్మతులకు గురయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నదని వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చునని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

అర్ధాంతరంగా నిలిపివేసిన అభివృద్ధి పనులు

మండలంలోని కడకల్లా, కంబర వలస, కె.ఇచ్చాపురం, బిటివాడ,

కొట్టుగుమ్మడలో బిల్లులు కాని సిసి రహదారి

రూ.2కోట్లతో నిర్మించిన తూడి- పివిఆర్ పురం రహదారి

అచెప్పువలస, వీరఘట్టం, ఎం.రాజపురం, చినగోరకాలనీ, జె.గోపాలపురం తదితర గ్రామాల పాఠశాలల వద్ద ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.65లక్షలతో ప్రహరీ గోడలు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. రూ.40 లక్షల వరకు పనులు పూర్తయినప్పటికీ పైసా బిల్లు కూడా చెల్లింపులు జరగలేదని అధికారులు చెబుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వివిధ రకాలైన అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ బిల్లులు అందకపోవడంతో గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని గుత్తేదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణను ప్రజాశక్తి' వివరణ కోరగా, మండలంలో రూ.9 కోట్లు పైచిలుక అభివృద్ధి పనులు జరిగాయని, ఒక్క దానికీ బిల్లు అవ్వలేదని అన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మే 20న దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ తరపున సంపూర్ణ మద్దతిస్తుందని వెల్లడించింది. మండలంలోని మూలజమ్మలో జరిగిన గిరిజన సంఘం కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు మండంగి సన్యాసిరావు మాట్లాడారు. గతంలో దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా 22 సార్వత్రిక సమ్మెలు జరిగాయని, నేడు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ప్రధాన డిమాండ్‌తో సమ్మె జరుగుతుందని, ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులకు చట్టాలు వర్తించకుండా చేసి బానిసలుగా చేసుకోవాలని చూస్తుందని, దీనికి రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు కూడా వత్తాసు పలకడం కార్మికులకు ద్రోహం చేయడమే అవుతుందని తెలిపారు. ఉపాధి హామీ నిధులు కుదించడం వల్ల రెగ్యులర్‌గా కూలీలకు రావాల్సిన బకాయి వేతనాలు రావడం లేదని, కేరళ ప్రభుత్వం వలే 18 రకాల నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించి ,అధిక ధరల ఇబ్బందుల నుంచి ప్రజలను ఆదుకోవాలని కోరారు. కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి ఎన్నికలకు ముందు అన్ని చేస్తామని చెప్పి, నేడు చేతులెత్తేసాయని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్లతో ఈనెల 20 సమ్మె జరుగుతుందని, అందుకే ఆదివాసీ గిరిజన సంఘం న్యాయమైన డిమాండ్ల కోసం చేపడుతున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెకు, అన్ని సెక్షన్ల ప్రజానీకం మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పువ్వల మోహన్రావు, కె.సుబ్బారావు, నిమ్మక రామలింగం పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా నినాదాలు చేస్తున్న గిరిజనులు

మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆర్‌టిసి డిఎంను కోరారు. శనివారం పార్వతీపురం ఆర్టీసీ డిఎం చేపట్టిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం నుండి కల్లికోట వరకు వెంటనే బస్సును పునరుద్ధరించాలన్నారు. గతంలో ఈ సర్వీసు ఉందని, రోడ్డు పెద్ద పెద్ద గోతులుగా మారడంతో బస్సు సర్వీసును నిలిపివేశారని, ప్రస్తుతం బిటి రోడ్డు వేయడంతో మళ్లీ కల్లికోట వరకు బస్సు పునరుద్ధరించాలని డిఎంను కోరారు. అలాగే పార్వతీపురం నుండి కూనేరు వరకు నైట్‌హాల్ట్ బస్సు లేకపోవడంతో పార్వతీపురం నుంచి 7.15గంటలు దాటితే కొమరాడ మండలానికి రావాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కావున నైట్‌హాల్ట్ బస్సు కూనేరు వరకు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. పార్వతీపురం నుండి మసి మండ గ్రామం మీదుగా లంజ గ్రామం వరకు బస్సు ఉండేదని, మూడున్నరేళ్లుగా ఆ బస్సు పూర్తిగా రద్దు చేయడంతో గిరిజన ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ రూట్‌లో బస్సును పునరుద్ధరించాలని కోరారు. అలాగే మండలంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సర్వీసులు నడపాలని డిఎంను కోరారు.

వండవలో తల్లికి వందనం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం బిటివాడ సెక్టార్ పరిధి వండవలో శనివారం సిడిపిఒ బి.సిమ్మాలమ్మా ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లల తల్లులకు పిల్లల ద్వారా గిఫ్టు అందజేసి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, ఎన్.రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జగన్మోహనరావు

ఆరోగ్య పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య విషయమై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని సుందరాపురాన్ని శనివారం సందర్శించి వైద్య సిబ్బంది సర్వే చేపట్టిన తీరు, ప్రజారోగ్య స్థితిగతుల పర్యవేక్షణ చేశారు. ముందుగా అక్కడ నిర్వహించిన వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఎంతమందికి టీకాలు వేశారు, గడువు తేదీలు పరిశీలించారు. వ్యాక్సిన్ వివిఎం పరిశీలించారు. యువిన్ ఆన్లైన్ నమోదు గమనించారు. గర్భిణీ, బాలింతలతో మాట్లాడి జాగ్రత్తలు సూచించారు. ఎంసిపి కార్డులో వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. టిహెచ్ఆర్ పంపిణీని అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారి వద్ద ఉండేలా చూసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. పిల్లల బరువును అక్కడ అంగన్వాడీ కేంద్రంలో తూనిక పరికరం ద్వారా గమనించారు. బరువు తక్కువగా గుర్తించిన ఒక పిల్లవాణ్ణి ఎన్ఆర్సీలో చేర్పించామని సిబ్బంది తెలిపారు. ఎన్సీడి సర్వే వివరాలపై ఆరా తీశారు. నోటి కాన్సర్‌కు శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తి ప్రస్తుత ఆరోగ్యాన్ని పర్యవేక్షించి మెరుగ్గా ఉందని తెలియజేశారు. అందుకు కారణమైన జీవనశైలి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని అతనికి సూచించారు. అనంతరం మంచానికి పరిమితమైన వృద్ధుని గృహ సందర్శన చేసి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే రోజు కొత్తగా నమోదైన గర్భిణీకి ఆరోగ్య సూచనలు చేశారు. గ్రామస్తులకు దోమల నివారణ, జ్వరాలు, వేసవి జాగ్రతలపై డాక్టర్ జగన్మోహన్ అవగాహన కల్పించారు. గ్రామంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.శారద, రమేష్, జానకి తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మురళీనాయక్‌కు నివాళి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భారత్ పాకిస్తాన్ మధ్య జరుగుతున్న కాల్పుల్లో గురువారం దేశం కోసం పోరాడి వీర మరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం రాత్రి ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా గోరంట్ల మండలం తల్లి తండాకు చెందిన మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు అర్పించి చరిత్రలో నిలిచిపోయారన్నారు. మురళి నాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పర్యాటకులను ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాదుల దారుణంగా కాల్చి చంపడం నీచాతి నీచమైన చర్య అని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధానికి రాజకీయాలు అతీతంగా భారత దేశంలోని ప్రజానీకచమంతా, భారతదేశ సైన్యానికి మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు వికాస్, చరణ్, సుధీర్, కిరణ్ నాని, పవన్, శైలజ, హేమలత పాల్గొన్నారు.

కొత్తవలస ఆనకట్ట పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలస ఆనకట్టను ఆధునీకరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ నాయకులు వి.లిదాలినాయుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తీళ్ళ గౌరీశంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకష్ణ తదితరులు మండలంలోని సువర్ణముఖి నదిపై దాదాపు బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఆనకట్టను పరిశీలించారు. ఆనకట్టపై రహదారి ఇరుగ్గా ఉండడం, ఓవైపు పెద్దపెద్ద బండరాళ్లతో భయంకరమైన లోయ ఉండడంతో ప్రజలు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. కావున రహదారిని వెడల్పు చేయాలన్నారు. అలాగే బ్రిడ్జికి ఇరువైపులా గార్డ్ రెయిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఆనకట్ట పైనుండి మక్కువ, సాలూరు, సీతానగరం, పార్వతీపురం తదితర మండలాలతో పాటు ఒడిశా కు చెందిన ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వర్షాకాలం వస్తే దాదాపు ఈ ఆనకట్టపై ప్రయాణాలు ప్రమాదకరంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం ఆనకట్ట గోడలు బీటలు వారాయన్నారు. గోడల్లో చెట్లు మొలవడంతో ఆనకట్ట పటుత్వం సన్నగిల్లిందన్నారు.

షట్టర్ల వద్ద చెట్లు, చెత్త ఇరుక్కు పోయిందన్నారు. ప్రస్తుతం ఆనకట్ట నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. 2016లో అప్పటి ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నీరు-చెట్టు పథకంలో గేటు, షట్టర్లు పునర్నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీటలవారిన గోడలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆనకట్ట రహదారిని వెడల్పు చేసి, మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆనకట్ట వద్ద వంతెన నిర్మాణం చేపడితే ఎక్కువ పొలాలకు సాగునీరందే అవకాశం ఉందన్నారు. కాబట్టి కొత్తవలస ఆనకట్ట వద్ద వంతెన నిర్మాణం చేపట్టి భయానక ప్రయాణాలను, ప్రమాదాలను నివారించాలని కోరారు.

ఆనకట్టను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల కోసం జోరుగా ప్రచారాలు

తల్లిదండ్రులను మభ్యపెడుతున్న విద్యాసంస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తమ పాఠశాలలోనే చేర్పించాలంటూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగులు గ్రామాల్లో జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే తమ పాఠశాలల్లోనే కార్పొరేట్ విద్యతో పాటు విద్యార్థులకు అనే రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, సబ్జెక్టు ఒక శిక్షణ పొందిన టీచర్ను ఏర్పాటు చేశామని, పిల్లల భవిష్యత్తు మెరుగుపడాలంటే తమ పాఠశాలలో చేర్పించాలని ప్రైవేటు విద్యా సంస్థల ఉద్యోగులు తల్లిదండ్రులను మభ్యపెడుతు న్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మీ పిల్లలకు మధ్యాహ్న భోజన సదుపాయం, ఉచిత విద్య, పుస్తకాలు పంపిణీ, అంతే కాకుండా క్రీడల్లో కూడా రాణించ గలుగుతు న్నామని చెబుతున్నారు. అలాగే కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందించడంతో 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలు నిదర్శన మని, మీ పిల్లల భవిష్యత్తు నాశనం చేయడమే కాకుండా ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలంటే ప్రభుత్వ పాఠశాల లోనే మీ పిల్లలను చేర్పించాలని, విద్యార్థులు తల్లిదండ్రు లకు ఉపాధ్యాయులు హితవు పలుకుతున్నారు. మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది కనుక ఒక్కసారి ఆలోచించి పిల్లల విషయంలో అడుగు ముందుకు వేయాలని, సర్కారు బడుల్లో మీ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చురుగ్గా సాగుతున్న వీరఘట్టం- పాలకొండ రోడ్డు

నాయకమ్మగూడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పొల్ల సచివాలయం పరిధిలో ఉన్న నాయకమ్మగూడలో శనివారం దోనుబాయి పిహెచ్‌సి వైద్యాధికారి భాను ప్రతాప్ వైద్య శిబిరం నిర్వహించారు 123 మందికి రక్తపోతలు సేకరించారు. రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు చిన్నపాటి జ్వరం వచ్చిన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం మండలం, పులిగుమ్మి **M.P.P.S** లో **S.G.T** గా పనిచేస్తున్న **గురాన శ్రీనివాసరావు** సర్వీస్ రిజిస్టర్ తేదీ 10-9--2022 నుండి 02-07-2023 మధ్యలో పార్వతీపురం **M.E.O** కార్యాలయం వద్ద మిస్ అయినది. ఈ **S.R** ఎవరికైనా దొరికిన యెడల పార్వతీపురం **M.E.O** కార్యాలయమునకు సమాచారం ఇవ్వగలరని కోరుచున్నాను.

పార్వతీపురం
మండల విద్యాశాఖ అధికారి